క్లుప్తంగా

నేడు అంతర్జాతీయ శ్వేత బెత్తం దినోత్సవం

మలక్‌పేట: ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ డిసెబుల్డ్ (ఫెడ్) ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ శ్వేత బెత్తం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ మద్దెల గంగారామ్, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లోని జాతీయ దివ్యకళా వేదికలో జరిగే కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, వికలాంగుల కమిషనర్ శైలజ, బాలల హక్కుల సంఘం చైర్మన్ శ్రీనివాస రావు హాజరవుతారని తెలిపారు.

చిత్ర లేఅవుట్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనంలో జిల్లా గవర్నర్ టి.చక్రపాణి అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చిత్రలేఅవుట్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రాసేనా రెడ్డి, కోశాధికారిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా అంజిరెడ్డి, రామచంద్రరావు, రాఘవరెడ్డి, జాలి వాకర్‌గా సీఆర్‌ఎం రావు, డైరెక్టర్‌గా జనార్థన్‌రెడ్డి, నర్సింగరావు, నారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, సలహాదారులుగా నర్సింహారెడ్డి, గోలి అమరేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం


మోతీలాల్ బారక్

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన ఓ భర్త కనిపించకుండా పోయాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మోతీలాల్ బారక్ (37) పదేళ్ల క్రితం పద్మిని మోహంతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే నాలుగు నెలల క్రితం మోతీలాల్ దంపతులు తుక్కుగూడకు వలస వచ్చారు. స్థానిక ఉడిపి హోటల్‌లో మోతీలాల్ సర్వెంట్‌గా పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 18వ తేదీన ఉదయం భార్యతో గొడవపడి పనికంటూ బయటికి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో ఆమె అదే రోజు రాత్రి హోటల్‌కు వెళ్లింది. అక్కడ ఉన్న సిబ్బందిని విచారించగా మోతీలాల్ పనికి రాలేదని తెలిపారు. ఆందోళన చెందిన భార్య.. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుకు మరో ఛాన్స్



- దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం



ఎల్‌బీనగర్: ఇంట్లో ఏ అవసరమున్నా త్వరగా పూర్తి చేయాలని ముందుకు సాగుతాం... అంతేకాకుండా ఇంట్లో ఎన్ని పనులున్నా వాటి కోసం సమయం కేటాయించి మరీ పూర్తి చేసుకుంటాం ... అయితే, భావితరాల భవిష్యత్‌ను నిర్దేశించే ఆయుధమైన ఓటు హక్కును మాత్రం నేటి యువత పట్టించుకోవడంలేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే ఓటు హక్కు ద్వారా సమాజంలో మార్పులు తేవడానికి యువతారానికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది ఎన్నికల సంఘం. రండి ఓటరుగా నమోదు కండి.

ఓటు హక్కు నమోదుపై స్పందన.....

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కొత్తగా యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేయడంపై మంచి స్పందన వచ్చింది. అక్టోబర్ 4 న తుది జాబితా ప్రకటించగా ఎల్‌బీనగర్‌లో సుమారు లక్షకుపైగా ఓటర్లు కొత్తగా ఓటు హక్కు కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కాగా ఓటరు జాబితాలో పేరు గల్లంతయిన వారితో పాటు 2023 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండి వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6ను పూర్తి చేయాల్సి ఉంది. అంతే కాకుండా ప్రసుత్తం ఇక్కడ నుంచి ఓటరు నివాసముండే ప్రాంతానికి చిరునామా మార్పు కోసం ఫారం-8 ను పూర్తి చేస్తే వెంటనే ఓటు బదిలీ అవుతోంది. ఈ పనులన్నీ మీ సేవా కేంద్రాలు, బీఎల్‌ఓలు, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 31 వరకు దరఖాస్తు చేయొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

దివ్యాంగులకు ఇంటి నుంచే..

80 ఏళ్ల వయస్సు నిండిన వృద్ధులు, అంగవైకల్యం కలవారు తమ ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఫారం 12-డి ద్వారా పోస్టల్ బ్యాలెట్ పొందిన వారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు నమోదైన ఓటర్లలో దివ్యాంగులు 6064 మంది ఉన్నారు. ఎల్‌బీనగర్‌లో 18-19 సంవత్సరాల వయస్సు కలవారు 8,566 మంది, 20-39 సంవత్సరాల వారు 2,52,582 మంది, 40-59 మధ్య వయస్సువారు2,18,096 మంది, 60-99 సంవత్సరాల వారు 86,440 మంది, 100-11 వయస్సుగల వారు ముగ్గురు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలి

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి


కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ పద్మావతి కల్యాణ మండపంలో నిర్వహించిన మలక్‌పేట నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పాతబస్తీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే ఇక్కడి ప్రజలు మజ్లిస్‌ను తిప్పి కొట్టి, ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. పాత మలక్‌పేట నియోజకవర్గంలో మూడుసార్లు బీజేపీని గెలిపించిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు తమ అనుభవంతో ఇప్పటి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయాలన్నారు. మలక్‌పేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్.ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి పార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని కోరారు.దేశంలో మరోసారి మోదీ, తెలంగాణలో ఈసారి బీజేపీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు శ్రమించాలన్నారు. సమావేశంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హరిగౌడ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు


సుధీర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు

ఎల్‌బీనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌కు చెందిన సీళ్ల రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్యక్షతన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో శనివారం పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, అందుకే పలు పార్టీల వారు తమ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారిలో దండు సుధాకర్‌యాదవ్, అశోక్‌నాయుడు, లయన్‌రాజు, సునీల్, రాఘవేందర్‌రావు, జగన్, హరిబాబులకు ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు గడ్డం మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి


వయోజనులకు పుస్తకాలు, లైట్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛ హృదయ సేవా వికాస సంస్థ నిర్వాహకులు

నాగోలు: సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని స్వచ్ఛ హృదయ సేవా వికాస సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ లావణ్య, రత్నం అన్నారు. శనివారం నాగోలు డివిజన్ సాయినగర్ గుడిసెల్లో వయోజన విద్యలో భాగంగా చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్య, ఆరోగ్య, ఆర్థిక, సాంఘిక అంశాలలో ప్రజలందరూ అభివృద్ధి చెందాలని సూచించారు. సమాజంలో చదువుకు దూరంగా ఉన్న వారికి స్వచ్ఛ హృదయ సేవా వికాస సంస్థ ఆధ్వర్యంలో చదువులో ప్రోత్సహిస్తూ విద్యను నేర్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వయోజనులకు పుస్తకాలు, లైట్లు, పలకలతో పాటు పలు రకాల అభ్యసన పరికరాలు, తులసి, ఉసిరి, తమలపాకులు, కలబంద వంటి వనమూలిక మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు చందు, డాక్టర్ శిఖామణి, సైదాబేగం, పాషా, యాదవయ్య, కమిటీ సభ్యులు కిషోర్, అరులే జయవేర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 13, వంకాయ 45, బెండ 28, పచ్చిమిర్చి40, కాకర 35, బీర 18, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, కారెట్ 29, దొండ 23, ఆలు 21, ఉల్లి 29, గోకర 35, దోస 13, సొర 13, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 55, అర్వి 40, మునగ 95, చిలగడదుంప 40, బీట్‌రూట్ 23, కీర 25.

టీఎస్‌పీఎస్‌సీని రద్దు చేయాలి: సీపీఐ


సడక్ బంద్‌ను నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో టీఎస్ పీఎస్సీ విఫలమైందని, యువత జీవితాలతో ఆడుకుంటున్న కమిషన్ సభ్యులను తొలగించి వారిపై కేసులు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింగ్‌రావు, ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. గ్రూప్-2 అభ్యర్థి ప్రవల్లిక మృతిని నిరసిస్తూ శనివారం అఖిల పక్షం పిలుపు మేరకు హయత్‌నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై సడక్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పించడంలో, పరీక్షలు నిర్వహించడంలో, జాబ్ కేలండర్‌ను రూపొందించడంలో బోర్డు సభ్యులు విఫలమయ్యారని, వారి నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారన్నారు. ప్రవల్లిక ఆత్మహత్యకు టీఎస్‌పీఎస్సీని బాధ్యులుగా చేసి చైర్మన్, సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మృతురాలి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి రూ.3 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనసమితి సభ్యుడు పల్లె వినయ్‌కుమార్, నాయకులు నాయకులు మత్యాల యాదిరెడ్డి, సామిడి శేఖర్‌రెడ్డి, హరిసింగ్ నాయక్, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, దిగోజు వేణుగోపాలచారి, పోలోజు లక్ష్మణ్, పామిడి వంశీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

వనస్థలిపురం: గ్రూప్-2, డీఎస్సీ అభ్యర్థి ప్రవల్లిక ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పైరవీలకు కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుందన్నారు. టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని, ప్రవల్లిక కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సాయం అందించాలని, మృతురాలి కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు

- వేడుకలకు ముస్తాబైన ఆలయాలు
- రోజుకొక రూపంలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారు


మన్సూరాబాద్ పోచమ్మ గుడిలో దేవీనవరాత్రులకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు


ఆలయంలోని అమ్మవారు

మన్సూరాబాద్: దేవి శరన్నవరాత్రోత్సవాలకు ఎల్‌బీనగర్ పరిధిలో పలు ప్రాంతాల్లోని ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రధానంగా కొన్ని కూడళ్ల వద్ద అమ్మవారి మండపాలను భక్తులు అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయాలు, అమ్మవారి మండపాల వద్ద రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా, దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో అమ్మవారు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

- మన్సూరాబాద్‌లోని పోచమ్మ దేవాలయం శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఆలయం ఎదుట భారీ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.
- నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలో దుర్గాదేవి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది.

చంపాపేట: కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని దుర్గామాత, సరస్వతీ దేవి, సంతోషిమాత, ఉప ఆలయాలలో ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దుర్గామాతను 15న బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణ, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణ, 18న మహాలక్ష్మీ దేవి, 19న లలితాదేవి, 20న సరస్వతీదేవి, 21న గౌరీదేవి, 22న దుర్గాదేవి, 23న రాజరాజేశ్వరీదేవి అలంకరణతో దర్శనమిస్తారన్నారు. సద్దుల బతుకమ్మ 22న సాయంత్రం 6 గంటలకు, 23న సాయంత్రం 6 గంటలకు విజయ దశమి, శమీ పూజలతో పాటు ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణలతో చండీ హోమం నిర్వహిస్తామన్నారు.

దుర్గానగర్ కాలనీలో..

డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో దుర్గామాత అమ్మవారి ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు దేవీ శరన్నవరాత్రి, బతుకమ్మ, విజయ దశమి ఉత్సవాలను నిర్వహిస్తామని కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి తెలిపారు.


పోచమ్మ ఆలయం ఎదుట వేసిన సెట్టింగ్ ..


కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ ఆలయం

'నారాయణ'లో బతుకమ్మ సంబురాలు


పండుగ సంబురాలు జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

దిల్‌సుఖ్‌నగర్: నారాయణ విద్యాసంస్థలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఉపాధ్యాయులందరినీ ఒక్కచోటికి చేర్చి వివిధ రకాల బతుకమ్మలను పూలతో అందంగా పేర్చి పూజలు చేసి ఆట పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగ బతుకమ్మ అని అన్నారు. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి ఏజీఎం హేమాంబర్, ఆర్‌ఐ రవి ప్రసాద్, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, గడ్డిఅన్నారం నారాయణ స్కూల్‌లో, దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.


గడ్డిఅన్నారం నారాయణ స్కూల్లో...


దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో..

శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ!

- ఘనంగా బతుకమ్మ సంబురాలు ప్రారంభం
- తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మను జరుపుకున్న మహిళలు



దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు మలక్‌పేట/ఎల్బీనగర్ జోన్ల పరిధిలో శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంగిలిపువ్వు బతుకమ్మను మహిళలు జరుపుకున్నారు. రంగు రంగుల పూలతో అందంగా పేర్చిని బతుకమ్మకు మహిళలు, యువతులు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ.. శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌర మ్మ చిత్రమై తోచునమ్మా.. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ...చిత్తు చిత్తులబొమ్మ శివుని ముద్దుల గుమ్మ.. అంటూ పాటలు పాడుతూ, కోలాటం, దాండియా ఆడుతూ సందడి చేశారు.

- మలక్‌పేట జోన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మలక్‌పేట, సరూర్‌నగర్ చెరువుకట్ట, కుర్మగూడ, ఐఎస్‌సదన్, సైదాబాద్ తదితర కాలనీలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ బద్ధంగా ఆట పాటలతో సంబురాలు జరుపుకున్నారు.
- కొత్తపేట వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి ఆలయం ముందు శనివారం రాత్రి మహిళలు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. బతుకమ్మలతో పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలంతా కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. అనంతరం అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక: ఎమ్మెల్యే

హస్తినాపురం: తెలంగాణ ప్రజల సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ(ఎంగిలి పువ్వు) పండుగను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్ హనుమాన్‌నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో కలిసి కోలాటం ఆడారు.


మన్సూరాబాద్ పెద్దచెరువువద్ద కార్పొరేటర్ కొప్పుల


హనుమాన్‌నగర్‌లో.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద..


కొత్తపేట అష్టలక్ష్మి ఆలయం ముందు బతుకమ్మ ఆడుతున్న మహిళలు




కొత్తపేట అష్టలక్ష్మి ఆలయం వద్ద..


వనస్థలిపురం శారదానగర్..

నేడు ప్రతిభ పురస్కారాల ప్రదానం

మలక్‌పేట: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్టు దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ జోనల్ అడ్మిన్ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మార్కులు సంపాదించిన విద్యార్థులకు సన్మానం, పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. వాసన్ ఐకేర్ ఆసుపత్రి పక్క లేన్‌లో ఉన్న తమ కాలేజీలో ఈనెల 15న సన్మాన కార్యక్రమం ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు మార్కుల జాబితా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన సూచించారు.